# శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- ఎన్నికల ప్రక్రియలో పీవో, ఏపీవోలది కీలక పాత్ర
- జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు 2036 మంది కేటాయింపు
- పోలింగ్‌కు ముందు మాక్ పోల్ నిర్వహించాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, తూర్పు ఆర్వో షేక్ రిజ్వాన్ బాషా

వరంగల్, అక్టోబర్ 31: ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వర్తించేందుకు ఇస్తున్న శిక్షణను అధికారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. ఎల్బీ కళాశాలలో మంగళవారం తూర్పు నియోజవర్గం పోలింగ్, అసిస్టెంట్ పోలింగ్ అధికారుల కోసం ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు 2036 మంది సిబ్బందిని కేటాయించామని కలెక్టర్ చెప్పారు. ఇందులో తూర్పునకు 931 మందిని కేటాయించినట్లు వెల్లడించారు. మూడు రోజులపాటు బ్యాచ్‌ల వారీగా తొలి విడుత శిక్షణ ఇస్తామన్నారు. ఎన్నికల ప్రక్రియలో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులది కీలక పాత్ర అన్నారు. ఎన్నికల సంఘం రూపొందించిన నిబంధనల పుస్తకంపై సంపూర్ణ అవగాహన ఉండాలన్నారు. పోలింగ్ సమయంలో చేయాల్సిన, చేయకూడని పనులపై పీవో, ఏపీవోలు అవగాహన కలిగి ఉండాలన్నారు. శిక్షణ రోజు నుంచి పోలింగ్ ముగిసే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పక్కాగా పాటించాలన్నారు. విధుల్లో ఉండే ఉద్యోగులు, సిబ్బంది ఏ పార్టీ అభ్యర్థులకు అనుకూలంగా పని చేయొద్దన్నారు. నిబంధనలు కఠినతరమైన నేపథ్యంలో ఉద్యోగులు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. పోలింగ్ సందర్భంగా ప్రతి పీవో తీసుకోవాల్సిన మెటీరియల్, ఈవీఎం, పీవో, ఏపీవో డైరీ, ఓటరు జాబితా, మార్కర్ కాపీ, పోలింగ్ కేంద్రం బయట ప్రదర్శించాల్సిన సామగ్రి పోలింగ్‌కు ఒకరోజు ముందే తీసుకోవాలని సూచించారు. పోలింగ్‌కు ముందు మాక్‌పోల్ చేపట్టాలన్నారు. ఫారాలు పూరించడంపై సాధన చేయాలన్నారు. అధికారులకు అందించే ఓటరు జాబితాలో మరణించిన వారి పేర్లపై మార్క్ చేసి ఉంటుందన్నారు. ఓటరు 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకదాన్ని పరిశీలించి పోలింగ్‌కు అనుమతించాలన్నారు. శిక్షణకు గైర్హాజరైన ఉద్యోగులు మరుసటి రోజు హాజరు కావాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తూర్పు రిటర్నింగ్ అధికారి షేక్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. తొలిరోజు 330 మంది పీవో, ఏపీవోలు శిక్షణకు హాజరైనట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్‌తో కలిసి ఈవీఎంలను పరిశీలించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో రాంరెడ్డి, తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, మాస్టర్ ట్రైనీ సందీప్‌కుమార్, డీఎస్‌వో వేణుగోపాల్, బల్దియా సూపరింటెండెంట్ హబీబ్, ఎన్నికల డీటీ మధుసూదన్ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

## రాష్ట్రస్థాయి జూడో పోటీలకు గుడిబడి విద్యార్థులు

కాశీబుగ్గ, అక్టోబర్ 31: కాశీబుగ్గలోని ప్రభుత్వ నరేంద్రనగర్(గుడిబడి) పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్‌ఐ) నిర్వహించిన జిల్లాస్థాయి జూడో పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు తాటికొండ కుమారస్వామి మంగళవారం అభినందించారు. బాలికల విభాగంలో 27 కేజీ విభాగంలో వంకిడి సిరిచందన, 32 కేజీ విభాగంలో సింగారపు మనస్విని, 44 కేజీ విభాగంలో మునావత్ స్వాతి ఎంపికయ్యారు. బాలుర విభాగంలో 35 కేజీ విభాగంలో అజ్మీరా అక్షయ్, 40 కేజీ విభాగంలో మంద సందేశ్, 50 కేజీ విభాగంలో బలబద్ర హరిచరణ్ ఎన్నికైనట్లు హెచ్‌ఎం తెలిపారు.

## ఇంజినీరింగ్ విద్యార్థినికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ప్రకాశ్‌రావు

గిర్మాజీపేట, అక్టోబర్ 31: ఆర్యవైశ్య నిరుపేద కుటుంబానికి చెందిన మాదారపు భిక్షపతి-లావణ్య దంపతుల కుమార్తె సోనాలికకు మంగళవారం ఆర్ఎన్‌టీ రోడ్‌లోని పట్టణ ఆర్యవైశ్యభవన్ కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు, మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావు ఆర్థిక సాయం అందించారు. చదువుకు పేదరికం అడ్డు రాకూడదనే ఉద్దేశంతో పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య కార్యవర్గ సభ్యులు, భద్రకాళీ దేవస్థానం మాజీ ధర్మకర్త తొనుపునూరి వీరన్న, కార్యాలయ సిబ్బంది శ్రీలతాదేవి, మంజుల, అజయ్, ప్రవీణ, లావణ్య, రమాదేవి, పూజ, ప్రియాంక, రమ, సారంగపాణి పాల్గొన్నారు.



గుండేటి నరేందర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

## కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం

వరంగల్ చౌరస్తా, అక్టోబర్ 31: కార్యకర్తల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటామని తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. వరంగల్ 27వ డివిజన్ పరిధిలోని రాంకీ విల్లాస్‌లో నివాసముంటున్న 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేందర్ అనారోగ్యంతో బాధపడుతుండగా మంగళవారం ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ సందర్భంగా అతడి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆయన వెంట మాజీ కార్పొరేటర్ భయ్యాస్వామి, బీఆర్ఎస్ నాయకులు దుబ్బ శ్రీనివాస్, మనోహర్, డివిజన్ కార్యకర్తలు ఉన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 45 మందికి జరిమానా

పోచమ్మమైదాన్, అక్టోబర్ 31: వరంగల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు రోజులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 45 మంది పట్టుబడినట్లు ట్రాఫిక్ సీఐ వెంకన్న మంగళవారం తెలిపారు. వీరికి వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి రూ. 50,100 జరిమానా, మరో ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష విధించారని పేర్కొన్నారు. అలాగే, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన నలుగురికి రూ. 2,800 జరిమానా విధించారని పేర్కొన్నారు.

## ఓటు ఆవశ్యకతపై అవగాహన

ఖిలావరంగల్, అక్టోబర్ 31: మెప్మా ఆధ్వర్యంలో పడమర కోటలో ఓటు ఆవశ్యకత, కొత్త ఓటరు నమోదుపై స్వీప్ నోడల్ అధికారి నరసింహమూర్తి అవగాహన కల్పించారు. అలాగే, స్థానిక కళాకారులు ఆటపాటలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ప్రాజెక్టు ఆఫీసర్ రాజేశ్‌కుమార్, ఓబీలు, ఆర్పీలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



కోటలో ప్రతిజ్ఞ చేయిస్తున్న స్వీప్ నోడల్ అధికారి నరసింహమూర్తి

## అసంక్రమిత వ్యాధులపై స్క్రీనింగ్ శాతం పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

గిర్మాజీపేట, అక్టోబర్ 31: అసంక్రమిత వ్యాధులైన అధిక రక్తపోటు, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు, పక్షవాతం, నోటి, గర్భస్థ, రొమ్ము క్యాన్సర్లపై స్క్రీనింగ్ శాతాన్ని పెంచి, ఆ వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి వైద్యుల పర్యవేక్షణలో ఉచితంగా వైద్యం అందేలా చూడాలని డీఎంహెచ్‌వో కాజీపేట వెంటకరమణ అధికారులను ఆదేశించారు. తన కార్యాలయంలో మంగళవారం ఆయన జాతీయ అసంక్రమిత వ్యాధులపై అధికారులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి ఫోన్ ద్వారా వారి అనారోగ్య లక్షణాలను తెలుసుకొని ఈ-సంజీవని ద్వారా వారికి ఇంటి వద్దే వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. ప్రతి వైద్య, ఆరోగ్య సేవలను ఆయుష్మాన్ భారత్ పోర్టల్‌లో రోజూ అప్‌డేట్ చేయాలన్నారు. ప్రజలకు అందించాల్సిన వైద్య సేవలను నిర్లక్ష్యం చేసే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో గోపాల్‌రావు, డాక్టర్ పద్మశ్రీ, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, జిల్లా కో ఆర్డినేటర్ ప్రకాశ్‌రెడ్డి, డీపీవో అర్చన, సంజీవ్, ఆరోగ్య కార్యకర్తలు, ఎన్సీడీ స్టాఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఫుక్రా బిరాదరి చౌదరి, నాయక్ నూతన కార్యవర్గం



కమిటీని సన్మానిస్తున్న జిల్లా అధ్యక్షుడు ఉల్పత్

ఖిలావరంగల్, అక్టోబర్ 31: ఫుక్రా బిరాదరి చౌదరి, నాయక్ శంభునిపేట నూతన కమిటీని మంగళవారం గిరిప్రసాద్‌నగర్‌లోని కమ్యూనిటీ భవనంలో ఫుక్రా బిరాదరి జిల్లా అధ్యక్షుడు ఎండీ ఉల్పత్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శంభునిపేట చౌదరిగా ఎండీ ఫిరోజ్, నాయక్ చౌదరిగా ఎండీ బషీర్‌తోపాటు మరికొందరిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఫక్రొద్దీన్, అర్బన్ అధ్యక్షుడు ఇస్మాయిల్, ఖిలావరంగల్ మండల గౌరవ అధ్యక్షుడు ఎండీ వహీద్ అలీ, ముఖ్య సలహాదారుడు ఎండీ రఫిక్, మండలాధ్యక్షుడు ఎండీ జావిద్, ఎండీ బోలేశ్ మజిద్, నజీర్, జైనుల్లాఠొద్దీన్, తాజ్, అక్రం, ముజాహిద్, షకీల్, ఖాదర్, యాకూబ్, సమీర్, గఫూర్, అబూబకర్ పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఘనంగా సన్మానించారు.

## నేడు శృంగేరి శంకరమఠంలో శక్తిగణపతి హోమం

పోచమ్మమైదాన్, అక్టోబర్ 31: సంకష్టహర చతుర్థి సందర్భంగా వరంగల్ శ్రీనివాస కాలనీలోని శృంగేరి శంకరమఠంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు అష్ట ద్రవ్యాలతో శక్తి గణపతి హోమం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు సంగమేశ్వరజోషి తెలిపారు. అలాగే, సాయంత్రం 6.30 గంటలకు శ్రీశక్తి గణపతి స్వామికి ఫల-పంచామృతాలతో అభిషేకం, మహామంగళహారతి, నారాయణ సేవ ఉంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో పాల్గొనాలనుకునే భక్తులు ముందుగా గోత్రనామాలను నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9989139461 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

## రేపు ఉభయ వేదాంత పండిత సభలు

పోచమ్మమైదాన్, అక్టోబర్ 31: మహామహోపాధ్యాయ, కవిశాబ్దిక కేసరి, శాస్త్ర రత్నాకర్ డాక్టర్ నల్లాన్ చక్రవర్తుల రఘునాథాచార్యస్వామి స్థాపించిన సత్సంప్రదాయ పరిరక్షణ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు హనుమకొండ బాలసముద్రం ఏకశిలా పార్కు పక్కన ఉన్న సీతారామ ప్రసన్నాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఉభయ వేదాంత పండిత సభలు నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు సముద్రాల పురుషోత్తమాచార్య, ప్రధాన కార్యదర్శి సముద్రాల శఠగోపాచార్యులు తెలిపారు. మూడు రోజులపాటు సాయంత్రం జరుగనున్న ఈ కార్యక్రమాలకు నగరానికి చెందిన భక్తులు, సాహితీవేత్తలు, ఆధ్యాత్మిక వేత్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## ఎన్నికల విధులు సక్రమంగా నిర్వర్తించాలి

### శిక్షణలో నర్సంపేట ఎన్నికల రిటర్నింగ్ అధికారి కృష్ణవేణి

నర్సంపేటరూరల్, అక్టోబర్ 31: ఎన్నికల విధులను పోలింగ్ అధికారులు, అసిస్టెంట్ పోలింగ్ అధికారులు సక్రమంగా నిర్వర్తించాలని నర్సంపేట ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో కృష్ణవేణి ఆదేశించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో లక్నేపల్లి శివారులోని బాలాజీ ఇంజినీరింగ్ కళాశాలలో పోలింగ్, సహాయ పోలింగ్ అధికారులకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మొదటి రోజు హాజరైన 370 మంది పోలింగ్ సిబ్బందికి ఉన్నతాధికారులు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకమన్నారు. పోలింగ్ విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ రోజు, ముందు రోజు చేయాల్సిన పనుల చెక్‌లిస్టు తయారు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎంసీసీ నోడల్ అధికారి డాక్టర్ బాలకృష్ణ, నియోజకవర్గ నోడల్ అధికారి కిరణ్‌కుమార్, తహసీల్దార్లు, పోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న ఆర్డీవో కృష్ణవేణి